# అనూరాధ

అనూరాధకి వుద్యోగం దొరికింది. ఆమె యెంతగా మురిసి పోయిందో చెప్పలేం. ఆమె మనసులో వున్న కోరిక నెఱవేరుతున్నందుకే, ఆ ఆనందమంతాను. నిజానికి ఆమెకి ఉద్యోగం చెయ్యాలన్న వుత్సుకతగాని, సరదాగాని, లేవు. కాని—ఆమె ఆశయం వేరు.

* * *

తలిదండ్రులకు ఒక్క కూతురు అనూరాధ. ఆమె తండ్రి వెంకటేశ్వర్లు. గవర్నమెంటులో ఓ చిన్న వుద్యోగం వెలిగించి, రిటైరయ్యాడు. నెలకి సుమారు ముప్ఫయి రూపాయిల ఫించను వస్తుంది. అతను రిటైరయ్యేనాటికి అనూరాధ, స్కూలుఫైనల్ పరీక్ష పాసైవుంది.

స్కూలుఫైనల్ పాసయ్యానన్న ఆనందంకూడా ఆమెకు లేకపోయింది. కారణం యేమిటంటే, భవిష్యత్తు ఆమె సమక్షంలో వికృతంగా నిలబడివుంది. 'తను యిప్పుడేం చెయ్యడం?' అన్న ఆలోచన, ఆమెను వుక్కిరి బిక్కిరి చేసింది. పైచదువు చదవాలన్న ఆసక్తి ఆమెలో వున్నా, యిప్పుడది సాధ్యం కాని పనసుకుంది. ఇంటి పరిస్థితులుకూడా యేమీ బావులేవు. నాన్న రిటైరై యింట్లో కూర్చున్నాడు. ఆయన యీ వయస్సులో

మరోవిధంగా శ్రమించి, ఆర్జించడం, దుర్లభమే. తనని యెలాగూ పైచదువు చదివించరు గాబట్టి, తనకి పెళ్ళిచేయడం తథ్యం. ఆ మధ్య ఓసారి యీ ప్రస్తావన వచ్చింది కూడాను. పెళ్ళి జరిగితే, తను అత్తారింటికి పోవల్సిందే; తప్పదు. అప్పుడు నాన్నా, అమ్మా, సుమారు ఒంటరిజీవితం గడపాలి. పిల్లిద్దర్ని చూసేవారెవరు? ఆ వచ్చిన కాస్త ప్రావిడెంటు ఫండూ, తన వివాహానికై యెలాగూ వెచ్చిస్తారు...అంతకు మించి వేరే మార్గం లేదు. వచ్చే ఆ ఫించనుతో వాళ్ళిద్దరి జీవితం సాగాలి. అది సాధ్యపడుతుందా? వాళ్లకి చాలదా డబ్బు. తన భవిష్యత్తు యెలావున్నా, కన్నందుకు వాళ్లుమాత్రం యీ త్యాగం చెయ్యాలి. అవస్థలు పడాలి... తను జీవించివుండి వాళ్లు కష్టాలు అనుభవిస్తుంటే, చూస్తూ వూరుకోగలదా? వాళ్లని ఆపద సమయంలో ఆదరించే వాళ్లెవరున్నారు? నిజంగా కొడుకు లేకపోవడం, ఒక కొరతేమో... యీవిధమైన ఆలోచనలు చాలా సేపు సాగించింది. ఆమెకి ఒకే ఒక్క మార్గం కనిపించింది. కొడుకులేనిలోటు తను తీర్చాలి. తనని కన్నందుకు, వాళ్ల ఋణం తీర్చుకోవాలి... అన్న నిర్ణయానికి వచ్చేసింది.

ఆరోజునుండి తండ్రికి తెలీకండా వుద్యోగ ప్రయత్నాలు సాగించింది. ఉన్న ఊర్లోనే ఓ ఆఫీసులో గుమాస్తా వుద్యోగం కోసం ఈమధ్య యింటర్వ్యూకి వెళ్ళింది కూడాను. ఆ వుద్యోగమే యిప్పుడామెకు లభించింది. అపాయింట్‌మెంట్ ఉత్తరం చేతపట్టుకొని, తండ్రికి చెప్పిందంతాను.

వెంకటేశ్వర్లు విస్తుపోయాడు మొదట్లో. హఠాత్తుగా కూతురిలో యీ పరివర్తన యెలా వచ్చిందా, అని విస్మయం పొందాడు. "నువ్వు వుద్యోగం చెయ్యడమేమిటే రాధా! మన వంశంలో యింతవరకూ వుద్యోగం చేసిన స్త్రీ యెవరూ లేరు. అయినా, హాయిగా పెళ్ళిచేసుకుని, సంసార జీవితం గడపవల్సిన దానివి, నీకు యీ వుద్యోగ ప్రయత్నమెందుకు, చెప్పు..." అన్నాడు వెంకటేశ్వర్లు.

అనూరాధకి తెలుసు తండ్రి అలా అంటాడని. చిన్నగా నవ్వింది.

"ఏమిటి నాన్నా మీరలా అంటారు? ప్రపంచం రోజుకి రోజు పురోగమిస్తున్న దేగాని, తిరోగమించడం లేదు. మన వంశంలో యెవరో స్త్రీలు వుద్యోగం చెయ్యడంలేదని, అవకాశం వున్న నేను కూడా వుద్యోగం చెయ్యకూడదంటే అర్థమేమిటుంది చెప్పండి: ఇక నా వివాహం విషయమంటారా... యిప్పుడేమీ తొందరలేదు ... ఆ విషయం తర్వాత చూసుకోవచ్చు." అంది.

కూతురు చెప్పింది వెంకటేశ్వర్లుకి అంత తృప్తికరంగా లేకపోయింది.

"అయినా అనూ, మా బాధ్యత కూడా నువ్వు కొంత యోచించాలమ్మా. తండ్రిగా నీ విషయంలో నాకున్న బాధ్యత యేమిటో తెలుసా? నిన్నో యింటిదానిగా చెయ్యడం! అప్పుడే, నా కర్తవ్యాన్ని నేను నెఱవేర్చుకున్నట్టు. అంతవరకూ నేను

గాని, మీ అమ్మగానీ, తృప్తిగా శ్వాస పీల్చలేమమ్మా! అప్పుడే మా మనసులు హాయిగా వుంటాయి." అన్నాడు సౌమ్యంగా. అతనే గాదు - అనూరాధ తల్లి సీత కూడా ఆ మాటల్నే బలపర్చింది.

అనూరాధ, తన మనసులో వున్నది వున్నట్టు చెప్పడం మంచిదని అనుకుంది. లేకపోతే తనని వాళ్ళు అర్థంచేసుకోరు.

"నాకోసం, నా వివాహం కోసం, మీ రేవిధంగానూ బాధపడకండి నాన్నా! నన్ను ఓ యింటిదానిగా చేసి, మీ బాధ్యత మీరు తీర్చుకోవాలనుకున్నారు. మీదగ్గరున్న ఆకాస్త పైకం వెచ్చించి, నా వివాహమనే బాధ్యత తీర్చుకొని తృప్తి పడాలనుకుంటున్నారు. కాని, మీ భవిష్యత్తు ఆలోచించారా? మీ యిరువురూ కాలం గడపటం యెట్లా? నాకు తెలిసిని సంసారమా మనది నాన్నా. అందుకే నేను వివాహం చేసుకో దల్చుకోలేదు నాన్నా! ఉద్యోగం చేసి మీకు యే విధమైన లోటూ రాకుండా చూస్తాను. అదే నా సంకల్పం. అదే నా ఆశయం కూడాను." అంది.

అనూరాధ చెప్పిందంతా సాంతంగా విని, వెంకటేశ్వర్లూ, సీతా, విస్తుపోయారు. ఆ ఆశ్చర్యంలో క్షణంసేపు యేమీ మాట్లాడలేక, ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. వాళ్ళెపుడూ యిటువంటి పరిణామాన్ని వూహించలేదు.

"ఏమిటే అనూ, నువ్వు చెప్తూంది? నీకేం పిచ్చి పట్టిందా?" అన్నాడు వెంకటేశ్వర్లు ... "మా భవిష్యత్తు

బాగుండదని, నువ్వు పెళ్ళిచేసుకోకండా వుంటాననటా వేమిటి ? ఎవరైనా వింటే, నవ్విపోతారు. మా భవిష్యత్తు కేం: ఏవో పింఛనురాళ్ళు వస్తున్నాయా మరి... ఆపైన యేదో వుద్యోగం చేసుకున్నానంటే, మాకేమీ లోటు వుండదు..."

"ఇంక మీ రేం వుద్యోగం చేస్తారు నాన్నా ? ఇంక, ఆ ఆలోచనేం పెట్టుకోకండి. నేను వుద్యోగం చెయ్యాలని నిశ్చయించుకున్నాను."

"విన్నవాళ్ళయినా యేమనుకుంటారే రాధా! మమ్మల్నే నిందిస్తారుగా ? నిన్నెవరూ నిందించరు. ఎవరైనా 'అమ్మాయికి పెళ్ళెప్పుడు చేస్తారు' అని అడిగితే, యేం జవాబు చెప్తాం చెప్పు? స్త్రీకి వివాహం కంటె, పవిత్రమైనది యింకేముంది? నా మాట విని, యీ పిచ్చివూహాలు, హృదయంనుండి తొలగించుకో! నీకు సలక్షణంగా పెళ్ళిచేసి, నువ్వు గృహస్థజీవితం సాగిస్తూవుంటే చూసి ఆనందించాలనీ, మనవల్ని యెత్తుకుని, వారితో ఆడుకోవాలనీ, మాకు కోరికలుంటే, నువ్వు అందుకు విరుద్ధంగా యిలా పట్టుబట్టావేఁవిటి ? నీ నిర్ణయాన్ని మార్చుకోఅమ్మా !" అంది సీత. తల్లిగా తను చెప్పాల్సిన రీతిలో చెప్పింది.

"అమ్మా ! నేను యేం చేసినా, ఆలోచించే ముందుకు సాగుతానని మీకు మాత్రం తెలీదా ? ఈ ఒక్క విషయంలో నాకు స్వతంత్రం యివ్వండి. పెళ్లి చేసుకోమని మాత్రం బలవంతం చెయ్యకండి..." మందహాసంతో చెప్పింది అనూరాధ.

"అవుతే, మరి పెళ్లి యెప్పుడూ చేసుకోవా ?" సూటిగా ప్రశ్నించాడు వెంకటేశ్వర్లు.

" చెప్పానుకదా నాన్నా ! తరుణం వచ్చినపుడు తప్పుతుందా ? "

వెంకటేశ్వర్లు, సీతా, యేమీ అనలేకపోయారు. కూతురి మనసుకి నొప్పి కలిగించడం వారిద్దరిలో యెవరికీ యిష్టంలేదు.

" నీయిష్టం రాధా ! స్వతహాగా ఆలోచించుకుని, మంచిని నిర్ణయించుకునేశక్తి నీలో వుంది. ఇంక మేం చెప్పాల్సిందేవిటీ. " అనేసి వూరుకున్నాడు వెంకటేశ్వర్లు.

" ఆ మాటన్నారు...అంతేచాలు నాన్నా ! " మురిసిపోతూ అంది అనూరాధ. తను వుద్యోగంలో చేరడానికి యింకయే ఆటంకమూ లేదనుకుంది.

*  *  *

ఉద్యోగంలో చేరిన మొదటి రోజు, అనూరాధ చాలా బిడియ పడింది. బిడియమే కాదు...భయంగా కూడా వుండేది ఆమెకి. అంతా కొత్త వాతావరణం...కొత్త మనుషులూను. ఆఫీసులోవున్న ప్రతీ యువకుడూ, ఆమె వేపు అదో విధంగా చూసేవాడు. ఆ చూపుల్లో ఆమెకి క్రూరత్వం అస్పష్టంగా అగుపించేది. మొహం దించుకునేది. ఆమె పనేవిటో అంతేగాని, యెవరితోనూ సాధారణంగా మాట్లాడేదికాదు. ఎవరైనా యేదేనా పని వుండి దగ్గరికి వస్తే, మొహం దించుకునే జవాబు

కథా నిలయం
1089
శ్రీకాకుళం

చెప్పేది. అప్పుడప్పుడు ఆమెకి అనిపించేది — యిలా తను వుద్యోగం యెన్నాళ్లు సాగించగలదో, అని.

రోజులు గడుస్తున్నాయి. హెడ్‌గుమస్తా వయసుమళ్లిన వాడు కావడంవల్ల, ఆమెను కూతురుకన్న మిన్నగా అప్యాయంగా చూసేవాడు. ఆమెకి ఆఫీసు పని విషయంలో యేది తెలీకపోయినా, ఆయన్ని అడిగేది. అంతేగాని, మరెవర్నీ సంప్రదించేది కాదు.

కొందరు యువకులు, అనూరాధతో పనిగట్టుకుని, మాట్లాడ్డానికి ప్రయత్నించేవారు కాని, వారు ఆశించిన విధంగా ఆమెనుండి అభిమానాన్ని గాని, ఆప్యాయత గాని, కనీసం ఓ మందహాసం గాని, పొందలేక పోయేవారు. ఒకరిద్దరు ఆమె అభిమానాన్ని సంపాదించడం కోసం ప్రాకులాడి అన్ని విధాల ప్రయత్నించి, అవమానపడ్డారుకూడాను.

క్రమంగా అనూరాధకి ఆ వాతావరణం కంటకప్రాయమనిపించింది. ఆడది కంటబడితే, మగవాడి హృదయంలో చప్పున ప్రేమ పుట్టుకొస్తుందే గాని, వాత్సల్యం యెందుకు జనించదో ఆమెకి బోధపడలేదు. క్రమంగా మగవాళ్ళంటేనే ఆమెలో అసహ్యం, యేహ్యాభావం పుంజుకొచ్చాయి.

అవుతే, మనం అనుకున్నవన్నీ అనుకున్నట్టే జరగడం, దుర్లభం. మగవాళ్ళంటేనే యేహ్యాభావం నింపుకున్న ఆమె హృదయం, భానుమూర్తి గురించి అనుకోకండా భావన సాగించింది. అతనికి ఓ ప్రత్యేకత యెలా అలవడిందో ఆమె యెంత

ఆలోచించినా అవగాహన కాలేదు. అతడు యెప్పుడూ తనతో మాట్లాడాలని గాని, తన అభిమానం సంపాదించాలని గాని, ప్రయత్నమే చెయ్యలేదు. అతని ప్రవర్తనే, అతని సహృదయతకు నిదర్శనమన్పించింది. ఏఁవిటో అతనిపట్ల ఓ విధమైన అభిమానం పుట్టుకొచ్చింది. ఇదో విచిత్రమైన మానవ స్వభావం. మనకోసం తెలుసుకోవాలన్న వారి పట్ల మనకి అంతగా సద్భావం కలుగదు. కాని, మనల్ని పట్టించుకోని వారి పట్ల అంతులేని అభిమానం పుట్టుకొస్తుంది...అనూరాధ కూడా యీ బలహీనతకు లొంగిపోయింది.

ఒకనాడు భానుమూర్తి, ఆఫీసుపని విషయంలో తప్పనిసరిగా, అనూరాధ దగ్గరికి రావల్సి వచ్చింది. అతని రాక, అనూరాధలో వుత్సాహాన్ని రేపింది. అతని మృదు మధుర మాటలు, ఆమెకి మత్తు కలిగించాయి. అతనితో యెంతో వుత్సాహంతో మాట్లాడింది. అవుతే, ఆమె ప్రవర్తన భానుమూర్తిలో యెటువంటి సంచలనం తెచ్చిందో తెలీదుగాని, తతిమ్మా యువకులు మాత్రం భానుమూర్తిపై అసూయపడ్డారు. వాళ్లు యే మందహాసం కోసం ఆశించి, ప్రయత్నాలు సాగించారో, యే చల్లని చూపు వారికి దక్కలేదో, ఆ అభిమానమే భానుమూర్తికి అమాంతంగా లభించడం, ఆ అసూయకు కారణమయ్యింది. ఆ అసూయతోనే, భానుమూర్తిని యెగతాళి చెయ్యడం ప్రారంభించారు.

నిజానికి భానుమూర్తి చాలా సహృదయుడు. ముక్కుకి సూటిగా పోయే వ్యక్తి. అతనికి యితరుల ప్రసక్తి అవసరం

వుండను. తనకీ, అనూరాధకీ, లేని అనుబంధం కల్పిస్తున్న తోటి వుద్యోగులపై అతనికి వుక్రోషం వచ్చింది. వాళ్ల సంకుచిత భావాలకు నొచ్చుకుని తిట్టుకున్నాడు. అంతే తను చేయగలిగిందనుకున్నాడు.

కాని, దూరంగా యోచిస్తే, అతనికి అనూరాధ పట్ల యేదో తెలియని, అర్థంకాని, అభిమానం పొడజూపుతోంది. అది ప్రేమో, అనురాగమో — యింకేమిటో అంతు చిక్కడం లేదతనికి.

అనూరాధ, యింతవరకూ మగవారికి యెంతదూరంగా వుంటూ వచ్చిందో, భానుమూర్తికి అంత సన్నిహితంగా వుండాలనుకుంటోంది. అందుకే, అప్పుడప్పుడు కలుగజేసుకుని, భానుమూర్తితో మాట్లాడుతూ, యితరుల అసూయకి ఆజ్యం పోసింది. భానుమూర్తి కూడా ఆమెకి దూరంగా వుండలేక పోతున్నాడు.

రోజులు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. అనూరాధ, భానుమూర్తి, పరిచయాన్ని పెంచుకుని ప్రేమికులయ్యారు. ఒకర్నొకరు విడిచిపెట్టలేని అనుబంధం వారిని పెనవేసింది.

భానుమూర్తి, తలిదండ్రులకు ఒకే ఒక్క కొడుకు. ముద్దు మురిపాలతో పెరిగినవాడు. అతడు యేమన్నా, తల్లిదండ్రులు కాదనలేరు. లేక లేక పుట్టిన వాడాయె. అనూరాధ ట్ల పెంపొందించుకున్న ప్రేమను వృథాగా పోనివ్వదల్చుకో

లేదు...ఆమెను పెళ్ళి చేసుకోవాలని తీర్మానించుకున్నాడు. అవుతే, ఆమె మనసు కూడా తెలుసుకోవాలిగా.

ఓ నాటి సాయంత్రం యిద్దరూ షికారు బైలుదేరారు. ఆ చల్లని గాలిలో యిద్దరూ చాలాసేపు మాట్లాడుకుని కూచున్నారు...తన అంతరాళంలో వున్న మాటను యెప్పుడు చెప్పడమా అని యెదురు చూస్తున్నాడు భానుమూర్తి.

" అనూ, యిలా యెన్నాళ్ళు మనం మనసులు కలిసినా, దూరంగా వుంటాం చెప్పు! మనం పెళ్ళి చేసుకుందాం..." సహజ ధోరణిలోనే సౌమ్యంగా అన్నాడు.

అనూరాధ త్రుళ్లిపడినట్టయ్యింది. భానుమూర్తి మాటలు, యెంతో మృదువుగా మధురంగా వినిపించాయి గాని, ఆనాడు తలిదండ్రులకు తనిచ్చిన వుపన్యాసం గుర్తుకు వచ్చి, ఆమె గుండెలు కొట్టుకున్నాయి. శరీరం, ఆపాదమస్తకం కంపించింది. తను యెందుకిలా ప్రవర్తించింది? ఈ పరిచయాన్ని యింతదూరం తీసుకు రావల్సిన అవసరం యేముంది? మూర్తి పట్ల వుండే సద్భావానికి లొంగిపోయి, అతని ప్రేమలో యిరుక్కుందా? ఇదంతా తనకి తెలీకండా జరగలేదే! అయినా, తను ఓ విధమైన బలహీనతకు లొంగిపోయింది. ఇప్పుడేం చెయ్యడం? మూర్తి ప్రశ్నకి యేం జవాబు చెప్పడం?... క్షణం సేపు ఆమెనోట మాట రాలేదు.

అనూరాధ మౌనాన్ని అర్థం చేసుకోలేక, ఆతృతపడ్డాడు భానుమూర్తి.

"ఏఁవిటి అలా ఆలోచనలో పడ్డావు అనూ ?" ఆసక్తిగా అన్నాడు ఆమె మొహంలోకి చూస్తూ.

అనూరాధ ఓ నిట్టూర్పు విడిచింది.

"మూర్తిగారూ, మన స్నేహం యింతవరకే పరిమితంగా వుండనీయండి. దయచేసి, పెళ్లి ప్రసక్తిమాత్రం తీసుకురాకండి !" అంది మొహం దించుకొని. పాపం, అతని మొహం చూడ లేకనే మొహం దించుకుంది.

భానుమూర్తి స్తంభించి పోయాడు. ఆమె యెందుకలా అన్నదో అర్థం చేసుకోలేక పోయాడు.

" ఏఁవిటి అనూరాధా, నువ్వంటున్నది ? మన ప్రేమ యింతటితో ముగిసిపోవాలంటావా ? అదెలా సాధ్యం చెప్పు ? పెళ్ళి కానిదే ప్రేమకి పరిపూర్ణత యెక్కడిది ? అసలు, నువ్వెందుకు భయపడుతున్నావో నాకు బోధపడ్డం లేదు. మీ నాన్న గారు ఒప్పుకోరనే భయమా ? ఆ భయమే అవుతే, మా వాళ్ళను పంపించి ఒప్పించేట్టు చేస్తాను. మా అమ్మా, నాన్నా, నా కోరిక నిరాకరించరు. ఎలాగైనా మన పెళ్ళి జరిగి తీరాలి అనూ !" ఆవేశంతో చెప్పుకుపోతున్నాడు మూర్తి.

అనూరాధ కళ్లు నీళ్ల పర్యంత మయ్యాయి. తను ప్రేమించి - కాదు - మూర్తిని అభిమానించి చాలా పొరపాటు చేసింది. ఇప్పుడు మార్గాంతర మేఁవిటి ? తను పెళ్ళి చేసుకుంటే, అమ్మా, నాన్నల భవిష్యత్తు జీవితం యేం కావాలి ? తను యే ఆదర్శంతో, పెళ్లి ప్రయత్నాలు చెయ్యొద్దని తలిదండ్రులతో

చెప్పిందో, ఆ ఆదర్శానికి అర్థం యేమిటి? అమ్మా, నాన్నా, తన గురించి యేమనుకుంటారు? తన స్వార్థం చూసుకుని, ఆదర్శాన్ని మర్చిపోవడం యెంతవరకూ సమంజసంగా వుంటుంది?... ఆమె ఆలోచనలకు అంతులేదు... కాని, పరిష్కారం మాత్రం కనిపించలేదు. ఆమెకి యేడుపు వచ్చినంత పనయ్యింది.

"క్షమించండి భానుమూర్తిగారూ: జరగకూడనిది, జరిగింది. అందుకు నేనెంతో బాధపడుతున్నాను. నా మనసులోని బాధ మీకు అర్థంకాదు... మా నాన్న నాకు వివాహం చేసేసి, తన బాధ్యత తీర్చుకుంటామన్నారు. కాని, నన్ను కని, పెంచి, పెద్దచేసిన వారికి మరో ఆస్కారంగానీ, ఆదరణ గానీ లేదు. మానాన్నకి వచ్చే పింఛను ఆ యిద్దరి పొట్టల్నీ నింపదు. ఇవన్నీ ఆలోచించి, వారి బాధ్యత కంటె, ముందు నా బాధ్యత నిర్వర్తించాలనుకున్నాను. నాకు వుద్యోగం చేసుకునే అవకాశం వుంది గనుక, వివాహం నిరాకరించాను. తమ భవిష్యత్తుని కూడా లెక్ఖ చెయ్యకండా, వచ్చిన ఆ కాస్త ప్రావిడెంట్ ఫండూ వెచ్చించి, నాకు వివాహం చెయ్యడం కర్తవ్యంగా యెంచిన తలిదండ్రులను సుఖపెట్టాలన్న వుద్దేశంతో వుద్యోగంలో చేరాను. అప్పుడు నాకు వివాహం పట్ల దృష్టిపోలేదు. అందుకే, యే పురుషుని కూడా సద్భావంతో చూసి యెరుగను. కాని, నా దురదృష్టమే అనండి – మీ పట్ల ఓ విధమైన సద్భావాన్ని సృజించుకుని, మీతో పరిచయాన్ని వృద్ధి చేసుకోకండా వుండలేకపోయాను. ప్రేమలత మన యిరువుర్నీ బంధించింది. కాని, అది అంత బలీయంగా వుంటుందని అనుకోలేదు. పరిస్థితి యింత

దూరం వస్తుందని వూహించలేదు. నేను పెళ్ళి చేసుకుంటే, అమ్మా, నాన్నా, యేమనుకుంటారు? వాళ్ళగతి యేంకావాలి? వాళ్ళకి ఆదరణ యెక్కణ్ణించి లభిస్తుంది? యిదే నా భయం... యిదే నాబాధ..." బాధతో ముగించింది అనూరాధ.

భానుమూర్తి నిర్విణ్ణు డయ్యాడు. అతనిలో వుత్సాహ మంతా వుడిగినట్టయ్యింది. తను యింతవరకూ యెవర్నీ ప్రేమించ లేదు. జీవితంలో ప్రథమసారిగా ప్రేమించిన యీ అనూరాధ, యిలా నిరాకరిస్తున్నందుకు అతని గుండెలు తరుక్కుపోయాయి.

"ప్రపంచంలో స్త్రీలంతా నీలానే తలిదండ్రుల విషయం గుర్తుంచుకుంటే, కొన్ని పెళ్లిళ్లు జరిగేవికావేమో అనూరాధా:" నిరుత్సాహంగానే అన్నాడు. ఇంకా ఆమెకు నచ్చజెప్పాలనే అతని ప్రయత్నమంతాను.

"అందరి జీవితాలతో నాకు ప్రమేయం లేదండీ మూర్తి గారూ: నా పరిస్థితి మీకు చెప్పాను. నా అసహాయతను మీ ముందుంచాను. మీరే ఆలోచించండి..." అంది అనూరాధ. ఆమె కళ్ల వెంబడి నీటిధార జాలువారింది.

ఆమె అనుభవిస్తున్న వ్యథను అర్థం చేసుకున్నాడు భానుమూర్తి. అతను మాత్రం యేమంటాడు? ఆమె తలి దండ్రుల్ని తమదగ్గరే వుండమనడం, సాధ్యంకాని విషయం. ఈ సమస్య అపరిష్కృతమైనదని నిర్ణయించుకున్నాడు.

"నేను చాలా దురదృష్టవంతుణ్ణి అనూరాధా! నేను యింతవరకూ యెవర్నీ ప్రేమించలేదు. జీవితంలో ప్రప్రథమంగా

నిన్ను ప్రేమించాను. నీ ప్రేమలో కొట్టుమిట్టాడుతూ, అవ్యక్తానుభూతి అనుభవిస్తూ, నా కలలన్నీ నిజం చేసుకోడానికి ప్రయత్నించాను కాని, యిప్పుడు నీ ధోరణి నన్ను పూర్తిగా కృంగదీసింది. నా స్వప్నాన్ని భస్మీపటలం చేసింది. ఇదంతా నా దురదృష్టం కాకపోతే యింకేమిటి అనూరాధా? భగ్నమయ్యే నాభవిష్యత్తును దృష్టిలో వుంచుకుని, నీ నిర్ణయాన్ని మార్చుకో గలిగితే ధన్యుణ్ణి... ఏమంటావు అనూరాధా?" ప్రాధేయపూర్వకంగా అడిగాడు భానుమూర్తి. అతని గొంతు జీర వోయింది. కళ్లు చెమ్మగిల్లినయ్.

భానుమూర్తి భాధని అవగతం చేసుకుంది అనూరాధ! అతను యీ పరిస్థితికి రావడానికి తనే కొంతవరకూ కారణమని కూడా అనుకొంది...బాధపడింది. కాని తనుమాత్రం యేం చెయ్యగలదు? ఒకప్రక్క తలిదండ్రుల భవిష్యత్తు – తను వారి హృదయాల్లో కల్పించిన ఆశ; మరో ప్రక్క తన జీవితానికి సంబంధించిన ప్రేమ – తనని మనసారా ప్రేమించిన ప్రేమికుని బాధ; ఒకటి తన కర్తవ్యం...మరొకటి తన ఆనందం. ఏది వదులుకోవడమో, ఆమెకి అర్థంకాలేదు. ఆమె మెదడు చిందరవందరయ్యింది ఆలోచనలతో.

"మూర్తిగారూ! నిజం చెప్పాలంటే, యిదంతా నా దురదృష్టం. అనుకోకండా లభించిన మీ ప్రేమపాత్రను చేతులారా జారవిడుచు కుంటున్నాను. ముందాలోచన లేకుండా ప్రవర్తించడం నాదే తప్పు...మీలో ఆశలు రేపింది నేను...

నాకు మీరేం శిక్ష విధించినా, అందుకు నేను అర్హురాల్నే. కాని... కాని.., నేను వివాహం మాత్రం చేసుకోలేను మూర్తిగారూ! నేనుఅసహాయురాల్ని. నన్ను మర్చిపొండి..." అంటూ వెక్కి వెక్కి యేడుస్తూ లేచి, చరచరా అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

"అనూ... అనూరాధా..." మూర్తి రెండు కేకలు నిస్పృహతో వేశాడు. కాని, ఆమె ఆగలేదు... ఆ కేకలు అనంత విశ్వంలో కలిసిపోయాయి.

మొదలు తెగిన వృక్షంలా కూలిపోయాడు మూర్తి. నిర్మించుకున్న ఆశాసౌధాలన్నీ చూస్తుండగానే కూలిపోతే, యింక చూడలేక గామోసు, కాస్సేపు కళ్ళుమూసుకున్నాడు... ఆ నిమీలిత నేత్రాలనుండి అశ్రువులు ధారగా చెక్కిళ్లపైకి జారాయి. అతను మౌనంగా అనుభవిస్తున్న బాధ, ఆవేదన వర్ణనాతీతం. అతని జీవితంలో అతనికి అంకురార్పణ అప్పుడే జరిగింది. కళ్లు ఒత్తుకుని, భారంగా లేచి యింటికేసి నడిచాడు భగ్నహృదయుడు భానుమూర్తి.

* * *

మరుసటి రోజు మామూలుగానే ఆఫీసుకు పోయింది అనూరాధ. కాని, భానుమూర్తి అగుపించలేదు. అతనివిషయం అడిగి తెలుసుకోవా లన్న వాంఛ మనసులో రేకెత్తినా, ముందుకి సాగలేక, ఆ ధైర్యాన్ని చంపుకుంది. గుండెల్ని రాయి చేసుకుంది...

ఒక గంట గడిచాక, తోటి వుద్యోగులు అనుకుంటూ వుండటం వింది — భానుమూర్తి వుద్యోగానికి రాజీనామా యిచ్చాడని; అనూరాధ కొయ్యబారి పోయింది. హృదయ స్పందన వుధృత మయ్యింది. ఆయన వుద్యోగం వదులుకోవడానికి తన నిరాకరణే కారణమా ?...అయినా, తను మాత్రం యేం చెయ్యగలదు ? తన కర్తవ్యం విస్మరించ లేదుకదా ?... ఆమె కళ్లు అప్రయత్నంగా చెమ్మగిల్లాయి. ఎవరూ చూడకుండా చీర చెంగుతో కళ్ళను ఒత్తుకుంది అనూరాధ. ఆమె చేయ గలిగిందంతే మరి !